క్లుప్తంగా

పక్కాగా అంగన్‌వాడీలు నిర్వహించాలి


అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ జానకి

సరుబుజ్జిలి: అంగన్‌వాడీ కేంద్రాలను పక్కాగా నిర్వహించాలని రొట్టవలస ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జానకి తెలిపారు. మండలంలోని పురుషోత్తపురం గ్రామంలో ఉన్న 3 అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతిరోజూ కేంద్రాలు నిర్దేశించిన కాలమాన ప్రకారం తెరవాలని సూచించారు. లబ్ధిదారులకు సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి


మాట్లాడుతున్న ఏవో సురేష్ కుమార్

జలుమూరు: అపరాలు పంటలైన పెసర, మినప, పొద్దు తిరుగుడు, వేరుశనగ పంటల్లో తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి కె.సురేష్ కుమార్ సూచించారు. మండలంలోని పర్లాం, తిమడాం గ్రామాల్లో పంట పొలాలను మంగళవారం పరిశీలించారు. రబీ పంటలో జిప్సం వినియోగం, మొక్కజొన్నపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఆయనతో పాటు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి


సూచనలిస్తున్న వ్యవసాయాధికారి సునీత

నరసన్నపేట: మొక్కజొన్న పంట వేసిన రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి కె.సునీత సూచించారు. మండలంలోని గోపాలపెంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కజొన్నకు ఆరు నుంచి ఎనిమిది తడులు అవసరమన్నారు. విత్తినప్పుడు, విత్తిన 15 రోజులకు, 30 నుంచి 35 రోజులకు, పూత దశలో, పూత వచ్చిన 15 రోజులకు, గింజ పాలు పోసుకొనే దశలో నీటి తడులు విధిగా పెట్టాలన్నారు. అలాగే మొక్కజొన్నపై కాండం తొలిచే పురుగు, కత్తెర పురుగులు ఆశించవచ్చని, రైతులు అప్రమత్తంగా ఉండి తగు నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

వెనుకబడిన విద్యార్థులను గుర్తించాలి


హెచ్‌ఎం లక్ష్మణరావుతో మాట్లాడుతున్న ఎంఈవోలు

జలుమూరు: ఉపాధ్యాయులు చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి బోధించాలని మండల విద్యాశాఖ అధికారులు బమ్మిడి మాధవరావు, ఆర్‌వీఎస్ ప్రసాదరావులు అన్నారు. మండలంలోని టెక్కలిపాడు, గొల్లపేట పాఠశాలల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించి నాణ్యత, శుభ్రత పాటించాలన్నారు. ఆయనతో పాటు హెచ్‌ఎం తర్ర లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

చిన్నారులకు సకాలంలో టీకాలు వేయాలి


టీకాల లబ్ధిదారుల జాబితాలను పరిశీలిస్తున్న డాక్టర్ జాన్ జూడ్ జాషువ

ఎల్.ఎన్.పేట: చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయాలని డబ్ల్యూహెచ్‌ఓ సంస్థ తరఫున స్టేట్ సర్వైలెన్స్ మానిటరింగ్ అధికారి (వ్యాధి నిరోధక) డాక్టర్ జాన్ జూడ్ జాషువ సూచించారు. మండలంలోని కరకవలస గ్రామంలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రామంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల పంపిణీ తీరును లబ్ధిదారులైన కొంతమంది చిన్నారులు, గర్భిణుల ఇళ్లకు వెళ్లి అడిగి తెలుసుకున్నారు. వ్యాధి నిరోధక టీకాలను ఎలా వేస్తున్నారో వైద్య సిబ్బంది ద్వారా పరిశీలించి తెలుసుకున్నారు. అలాగే పలు సూచనలు చేశారు. వయస్సును బట్టి వేస్తున్న టీకాలతో వారికి కలిగే ప్రయోజనాల కోసం లబ్ధిదారులకు అవగాహన కలిగించారు. ఆయనతో పాటు తురకపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ లక్ష్మీదీప్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సుపేట గ్రామం..
అధ్యాత్మిక నిలయం..!

- గ్రామంలో ఎన్నో దేవుళ్లకు ఆలయాలు
- నిత్యం వెల్లివిరుస్తున్న ఆధ్యాత్మిక
- భక్తిపారవశ్యంలో ప్రజలు


జగన్నాథస్వామి ఆలయం

ఎల్.ఎన్.పేట:

మండల కేంద్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో వంశధార నదీ తీరంలో ఉన్న లక్ష్మీనర్సుపేట గ్రామం రోజురోజుకూ ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందుతోంది. సుమారు 6 వేల మంది జనాభా ఉండే ఈ గ్రామం మూడున్నర దశాబ్దాల క్రితం వరకు వ్యాపారపరంగా ఎంతో అభివృద్ధిలో ఉండేది. అన్ని గ్రామాల్లోనూ దుకాణాలు ఏర్పడడంతో వ్యాపార కేంద్రంగా క్రమేపీ కనుమరుగైంది. అయితే కొన్ని సంవత్సరాలుగా ఆధ్యాత్మికంగా కొత్త పుంతలు తొక్కుతోంది. గ్రామంలో బ్రహ్మ కుమారీస్ ఏర్పాటు చేసిన మందిరంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

గ్రామంలోని ఆలయాలు

వంశధార నదీ తీరంలో కొలువైన లక్ష్మీనర్సుపేట గ్రామం ప్రవేశంలోనే శ్రీకోదండ రామాలయం ఉంది. కొంచెం ముందుకు వెళ్తే నాయుడు వీధి కూడలి వద్ద నలువైపులా అద్దాలతో నిర్మించిన శ్రీకృష్ణ మందిరం, సమీపంలోనే సత్యసాయి మందిరం, కొంచెం దూరంలోనే శ్రీజగన్నాథ స్వామి ఆలయం, ఒరియా బ్రహ్మణ వీధిలో శివపార్వతుల ఆలయం, అభయాంజనేయ స్వామి గుడి, బ్రహ్మ కుమారీస్ మందిరం, వంశధార నదీ తీరంలో పిలిస్తే పలికే దైవంగా కొలిచే బంగారమ్మ తల్లి గుళ్లు ఉన్నాయి.

పదేళ్లకోసారి పండగలు

పిలిస్తే పలికే తల్లిగా కొలిచే గ్రామ దేవత బంగారమ్మ తల్లికి ప్రతీ పదేళ్లకు ఒకసారి పది రోజులు పాటు పండగలు నిర్వహిస్తారు. ఆ పదిరోజులు అమ్మవారికి ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు గ్రామంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను చేపడతారు. పది రోజుల పండగలో గ్రామంలో ఏ ఇంట చూసినా బంధువులతో సందడిగా ఉంటుంది. ప్రతిరోజూ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

వైభవంగా రథయాత్ర

లక్ష్మీనర్సుపేట గ్రామంలో కొలువైన జగన్నాథ స్వామి ఆలయానికి ఒక ప్రత్యేకత ఉంది. పురాతనంగా ఉన్న జగన్నాథ స్వామి ఆలయంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు జరుగుతూనే ఉంటాయి. ప్రతీ ఏడాది ఆషాడ మాసంలో పూరీ జగన్నాథుని మాదిరిగానే ఇక్కడి జగన్నాథునికి రథయాత్ర నిర్వహిస్తారు. గుండిచా మందిరానికి వెళ్లిన జగన్నాథుడు పది రోజుల పాటు దశావతారాల్లో భక్తులకు దర్శనమిచ్చి పూజలు అందుకుంటాడు. తొలి, మారు రథయాత్రలు భక్తిశ్రద్ధలతో ఎంతో సందడిగా నిర్వహిస్తారు.


కోదండ రామాలయం


కోరిన కోర్కెలు తీర్చే బంగారమ్మ తల్లి

గ్రామస్తుల సహకారంతోనే...



గ్రామంలో ఉన్న అన్ని ఆలయాల్లో జరిగే ప్రతీ కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహిస్తారు. గతంలో కంటే ప్రస్తుతం ఆధ్యాత్మిక భావాలు అందరిలోనూ పెరుగుతున్నాయి. ఆలయాల్లో జరిగే అనేక పూజలు, అధ్యాత్మిక కార్యక్రమాలకు దాతలు విరాళాలు ఇచ్చేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు.

వి.పకీరు, లక్ష్మీనర్సుపేట, ఎల్.ఎన్.పేట

కలిసికట్టుగా ఉంటాం



ప్రతీ ఏడాది శ్రీజగన్నాథ స్వామి రథయాత్ర నిర్వహిస్తాం. పదేళ్లకోసారి శ్రీబంగారమ్మ తల్లి పండగలు, ఏకాదశి, కార్తీక మాసంలో వచ్చే పూజలు గ్రామస్తులందరం కలిసికట్టుగా భక్తిశ్రద్ధలతో జరిపించుకుంటాం. పండగలు చేసేందుకు రెండు, మూడు నెలల ముందే కమిటీ ఏర్పాటు చేసుకుంటాం. గ్రామానికి వచ్చే బంధువులకు, స్నేహితులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

అశోక్ పాణిగ్రహి,
వైస్ సర్పంచ్, లక్ష్మీనర్సుపేట, ఎల్.ఎన్.పేట

117 జీవో అంశాలను పరిశీలించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో మధుసూదనరావు


మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు బుచ్చిబాబు

నరసన్నపేట: పాఠశాలల్లో అమలులో ఉన్న 117 జీవో విత్‌డ్రాపై ప్రభుత్వం సూచించిన కొత్త అంశాలు అన్నింటినీ ఉపాధ్యాయులు పరిశీలించాలని ఎంపీడీవో మధుసూదనరావు, తహసీల్దార్ సత్యనారాయణలు అన్నారు. జీవో విత్‌డ్రాల్‌పై స్కూల్ హెచ్‌ఎంలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు దాలినాయుడు, శాంతారావులు మాట్లాడుతూ నూతనంగా మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, 60 మంది విద్యార్థులు దాటి ఉంటే ఉన్నత పాఠశాలలుగా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతం ఉన్నత పాఠశాలల్లో ఉన్న 3, 4, 5 తరగతుల విద్యార్థులు యథావిధిగా దగ్గర ఉన్న స్కూల్స్‌కు వెళ్లడం జరుగుతుందన్నారు. ఈ అంశాలను ఉపాధ్యాయులు గమనించి స్కూల్స్‌ను బలోపేతం చేయడానికి సహకరించాలన్నారు. సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో పాటు మండలంలో ఉన్న స్కూల్ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

హిరమండలం: ప్రభుత్వ పాఠశాల విద్యను బలోపేతం చేసేందుకే జీవో నంబర్ 117ను ప్రభుత్వం రీ ఆర్గనైజేషన్ కార్యక్రమం చేపడుతోందని హిరమండలం జెడ్పీటీసీ సభ్యుడు పాగిరి బుచ్చిబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో 117 జీవోపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జీవో రీ ఆర్గనైజేషన్ వలన ప్రతీ పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ పాఠశాల ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఎంపీడీవో కాళీ ప్రసాద్, తహసీల్దార్ హనుమంతరావు, ఎంఈవోలు కె.రాంబాబు, బి.గొల్లవాడు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

24న సోషల్ ఆడిట్‌పై ప్రజా వేదిక

నరసన్నపేట: ఈనెల 24న వెలుగు కార్యాలయం వద్ద సోషల్ ఆడిట్‌పై మండల స్థాయిలో ప్రజావేదిక జరగనుందని ఏపీవో యుగంధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022/23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధి పనులపై సోషల్ ఆడిట్‌ను ప్రత్యేక బృందాలు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించా యి. దీనిపై మండల స్థాయి ప్రజావేదిక సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆధార్ క్యాంపులు వినియోగించుకోవాలి

నరసన్నపేట: మండలంలో ఆరేళ్ల లోపు చిన్నారుల కోసం ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మధుసూదనరావు మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. 22న మాకివలస, నరసన్నపేట సచివాలయం-4, కోమర్తి, ఉర్లాంలో, 23, 24 తేదీల్లో గోపాలపెంట, జమ్ము, దూకులపాడు, లుకలాం గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి


ఆమదాలవలస: పశువైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జేడీ రాజగోపాలరావు


నరసన్నపేట: మాకివలసలో మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం


బూర్జ: సుంకరపేట గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఎల్.ఎన్.పేట: పాడి పశువుల కోసం ఉచితంగా అందిస్తున్న పశువైద్య సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ పశువైద్యశాల డాక్టర్ జి.కవిత అన్నారు. మండలంలోని దబ్బపాడు గ్రామంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో ఎంపీటీసీ పల్లి జయలక్ష్మి, మాజీ సర్పంచ్ జమ్మి మోహనరావు, నాయకులు ముద్దాడ లక్ష్మణరావు, గ్రామ సచివాలయ పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాతపట్నం: ఉచిత పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సూచించారు. మండలంలోని తిడ్డిమి గ్రామంలో పశువైద్య శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. శివ్వాల చిన్నయ్య, పైల బాబ్జి, తులుగు ప్రవీణ్, ఎంపీటీసీ కె.గీత, ఏడీలు కె.కరుణకరరావు, ఎం.లోకనాథం, పశు వైద్యులు బి.శ్రీవాణి, అనిల్ కుమార్, కె.మౌనిక పాల్గొన్నారు.

కొత్తూరు: ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను పాడి రైతులు వినియోగించుకోవాలని స్థానిక ఏడీ నారాయణరావు, వైస్ ఎంపీపీ ఎల్.తులసీవరప్రసాదరావులు కోరారు. కొత్తూరులో ఉచిత పశువైద్య శిబిరాల కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు.

జలుమూరు: మండలంలోని బొడ్డపాడులో పశువైద్య శిబిరం నిర్వహించారు. దీనిలో భాగంగా అచ్యుతాపురం పశువైద్య అధికారి పట్ట సంతోష్ కుమార్ పశువులు, గొర్రెలకు వ్యాక్సిన్లు వేశారు.

బూర్జ: మండలంలోని సుంకరపేట, అల్లెన గ్రామాల్లో పశువైద్య శిబిరాన్ని పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ కె.రాజగోపాలరావు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఆమదాలవలస ఏడీలు ఆర్.ఆనందరావు, సీహెచ్ సుబ్రహ్మణ్యం, పశువైద్యాధికారులు డాక్టర్ ఎం.జ్యోత్స్న, డాక్టర్ కరుణ తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట: మండలంలోని మాకివలస, గొనబుపేటలో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. మాకివలస సర్పంచ్ రావాడ మోహనరావు పాడి రైతులకు మందులు పంపిణీ చేయగా, పశువులకు మడపాం పశువైద్యాధికారి పి.శ్రీవేణి తనిఖీలు నిర్వహించారు. అలాగే గొనబుపేటలో నడగాం పశువైద్యాధికారి ఆశాలత పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

ఆమదాలవలస: మండలంలోని ఎస్ఆర్‌సీపేట గ్రామంలో ఆ శాఖ ఏడీ ఆర్.ఆనందరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరాన్ని పశుసంవర్ధక శాఖ జేడీ కంచరాన రాజగోపాలరావు పరిశీలించారు.


జలుమూరు: వ్యాక్సిన్లు వేస్తున్న సంతోష్ కుమార్


కొత్తూరు: కరపత్రాలను అవిష్కరిస్తున్న దృశ్యం


పాతపట్నం: తిడ్డిమిలో మందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు


ఎల్.ఎన్.పేట: గోడపత్రికను అవిష్కరిస్తున్న డాక్టర్ కవిత, ఎంపీటీసీ జయలక్ష్మి తదితరులు

నిరుపయోగం



సారవకోట మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలకు ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ పలకలు నిరుపయోగంగా మారాయి. ఈ పాఠశాలకు సోలార్ ద్వారా విద్యుత్ సరఫరా చేసేందుకు గతంలో ప్రభుత్వం అందించింది. అయితే ఇక్కడ పాఠశాల అదనపు భవన నిర్మాణ పనులు జరుగుతుండడంతో వాటిని గత కొన్నేళ్ల క్రితం తీసి మూలకు చేర్చారు. దీంతో లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఈ సోలార్ సిస్టం నిరుపయోగంగా ఉంది. – సారవకోట

ప్రమాదపు మలుపు



చూశారా ఈ రహదారి మలుపు ఎంత ప్రమాదకరంగా ఉందో. ఆమదాలవలస నుంచి పురుషోత్తపురం వరకు ఉన్న ఆర్అండ్‌బీ రహదారిలో ప్రధానంగా పొన్నాంపేట నుంచి ఆమదాలవలస వరకు ఇలాంటివి సుమారు 6 మలుపులు ఉన్నాయి. అయితే ఆ మలుపులు వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడం వలన తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. ఒకేసారి మలుపు ఉండడం వలన ఎదురుగా వచ్చే వాహనాలు పూర్తిగా కనిపించడం లేదు. రహదారికి రెండు పక్కలా జంగిల్ క్లియరెన్స్ కూడా చేయకపోవడం వలన మరీ ఇబ్బందికరంగా ఉంటోందని ప్రయాణికులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో కొత్తగా ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. – సరుబుజ్జిలి

తవ్వేసి వదిలేశారు



కొత్తూరు మండలంలోని వసప కాలనీ వద్ద నిత్యం రద్దీగా ఉండే పాలకొండ-హడ్డబంగి పీహెచ్ రోడ్డుపై ఇంటింటా కుళాయిలు ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్‌కు చెందిన కూలీలు తవ్వేసి వదిలేశారు. దీంతో రోడ్డుకు మధ్యలో గోతులు ఏర్పడడంతో వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. ఈ ప్రాంతంలో పలువురు వాహనదారులు సైతం ప్రమాదాలకు గురైయ్యారు. అందువలన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి గోతిని పూడ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– కొత్తూరు

'అపరాలపై మంచు ప్రభావం'


అవలంగిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో సంధ్య

హిరమండలం: అపరాలపై మంచు ప్రభావం ఉంటుందని మండల వ్యవసాయాధికారి బి.సంధ్య అన్నారు. మండలంలోని అవలంగి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈవో మాట్లాడుతూ రైతుల సమస్యలు తీర్చడానికే పొలం పిలుస్తోంది నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం రైతులతో కలిసి అపరాల పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో రుగడ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పులికాలం నాటికకు రెండు బహుమతులు


నాటిక ప్రదర్శిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: ఈనెల 19, 20 తేదీల్లో ఖర్గపూర్‌కు చెందిన ప్రవాసాంధ్ర నవ్య కళా పరిషత్ నిర్వహించిన అఖిల భారత స్థాయి నాటికల పోటీల్లో ఆమదాలవలసకు చెందిన కవి కుప్పిలి వెంకటరాజారావు రచించి, దర్శకత్వం వహించిన పులి కాలం నాటిక విలన్ పాత్రధారి కుప్పిలి శ్యామలరావుకు ఉత్తమ విలన్ అవార్డు లభించింది. ఇదే నాటికలో నటించిన ఎస్.దీపిక ఉత్తమ నటిగా ప్రోత్సాహక బహుమతి అందుకుంది. ఈ అవార్డులను సినీ నటుడు నాగినీడు చేతులమీదుగా అందుకున్నారు. అఖిల భారత స్థాయిలో ఒకే నాటికకు రెండు బహుమతులు రావడంతో స్థానికులు, పలువురు రచయితలు అభినందనలు తెలిపారు.

గిరిజన యువతకు శిక్షణ


మాట్లాడుతున్న ప్రాజెక్టు కోఆర్డినేటర్ రమణ

పాతపట్నం: ప్రభుత్వం అందించే పథకాలు గిరిజన ప్రజలకు అందించే విధంగా ఉండాలని ఐటీడీఏ పీఎంయు ప్రాజెక్టు కోఆర్డినేటర్ జేవీ రమణ అన్నారు. మండలంలోని బ్రహ్మరాజపాలేంలోని బ్రెడ్స్ కార్యాలయంలో గిరిజన యువతకు మంగళవారం ప్రభుత్వ పథకాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కో ఆర్డినేటర్ మాట్లాడుతూ డీబీటీ పథకాలు ఉపాధి హామీ, పీఎం కిసాన్, ఎన్‌పీసీఐ లింక్, సిక్స్‌స్టెప్స్ వాలిడేషన్‌తో పాటు 16 రకాల డాక్యుమెంట్స్ వివరాలు తెలియజేశారు. కార్యక్రమంలో బ్రెడ్స్ ప్రెసిడెంట్ వి.సాంబమూర్తి, కళ్యాణ్ రామ్, లోకేష్, అనీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దనే ధ్రువీకరణ పత్రం


ఇంటి వద్దనే లైఫ్ సర్టిఫికెట్ అందజేస్తున్న సిబ్బంది

పొందూరు: అస్వస్థతతో కదలలేని స్థితిలో ఉన్న విశ్రాంత ఉద్యోగులు, కుటుంబ పింఛనుదారుల ఇంటికే నేరుగా వెళ్లి వార్షిక జీవిత ధ్రువపత్రాలను అందించే కార్యక్రమానికి స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం మంగళవారం స్వీకారం చుట్టింది. ఫిబ్రవరి చివరి వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని సంఘం కార్యదర్శి పాలిశెట్టి సూర్యప్రకాశరావు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాలవలస దివాకర్‌పాత్రో, వాండ్రంగి దామోదరరావులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్రామదేవత ఉత్సవాలు

సారవకోట: మండలంలోని తొగిరి పంచాయతీ కొమ్ముువలసలో గ్రామదేవత ఉత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు చేపట్టారు. చివరి రోజు గ్రామంలోని మహిళలంతా ఘటాలతో అమ్మవారి ఆలయానికి బయల్దేరి ఆలయంలో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.